చీకటి మలుపు

శ్రీ చింతలపూడి వెంకటేశ్వరరావు

బయటనుంచి నిస్పృహ చెందుతూ వచ్చిన వెంకట్రావు, మడతమంచం వాల్చి, గోడకు ఆనుకొని కూర్చున్నాడు. ఎదురుగుండా వున్న కిటికీవైపు చూస్తున్నాడు. నక్షత్రాలు లేని నల్లని ఆకాశం కన్పిస్తుంది. కిటికీ తలుపులు గాలికి టపటపా కొట్టుకుంటున్నాయి. ఇనపవూచకు వ్రేలాడుతున్న దీపం భగ్గుమనిమండి, హఠాత్తుగా ఆరిపోయింది. గదంతా చీకటిమయం. ఆరిపోయిన దీపం గురించి వెంకట్రావుకి పట్టినట్లు లేదు. కూర్చున్నవాడు కూర్చున్నట్లే వుండిపోయాడు. వంటింట్లోనుంచి వచ్చిన సుగుణ, ఆరిపోయిన దీపం వెలిగించింది. మంచంమీదవున్న వెంకట్రావును చూచి, కొంచెం ఆశ్చర్యపడింది. అతనిదృష్టి, వేటికోసమో వెతుక్కుంటున్నట్లు, అతనికళ్ళే చెపుతున్నాయి.

"అన్నయ్యా! ఎంతసేపయింది వచ్చి" అని ప్రక్కగా నిలబడి అతనివంక చూస్తోంది. సమాధానం లేదు. ఈ సారి కొంచెం గట్టిగా అంది. అతడు వులిక్కిపడి, ముందుకు వంగిచూశాడు. అతనివేపుకి నివ్వెరబోతూ చూస్తూన్న సుగుణను చూచి, ఎందుకో నవ్వుకున్నాడు. ఆమెకూడ నవ్వింది. ఇద్దరి హాసచంద్రికలకు, బహుశా సమాధానం వేరుకావచ్చును. కాని ఆమె ఎందుకు నవ్వింది, అతడు అడగలేకపోయాడు. అతడు ఎందుకు నవ్వుకుంది అర్థంచేసుకోడానికి ప్రయత్నం చేశాడు. కొన్ని క్షణాలు గడచిన తర్వాత, "చెల్లి! అమ్మను ఒకసారి పిలు" అని అడిగాడు.

"అమ్మ ఇంట్లోలేదు." ఇంకా ఏమో అనబోయింది. నాలుక చివరవరకు వచ్చిన మాటలు బైటికిగా లేకపోయినవి. నాలుక కొరుక్కుంది. అక్కడవుంటే, వెళ్ళిన వివరాలు అడుగుతాడని, అచ్చటనుంచి కదిలింది. ఆమె వెళ్తున్నవైపు చూచి "ఎక్కడికి వెళ్ళింది?" ఆమెకు విన్పించేటట్లు అన్నాడు. వెనక్కి తిరిగి చూచింది. ఆమె విశాల నయనాలలో భయపడుతున్న ఛాయలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. మళ్ళా మొదటి ప్రశ్నే వేశాడు. ఇప్పుడు అతడు అడిగినప్పుడు చెప్పకుండావుండలేకపోయింది.

"కుటుంబరావుగారింటికి వెళ్లింది ..." అచ్చట నిలబడలేదు. తలవంచుకొని, లోపలికి వెళ్ళిపోయింది. ఆమె కన్పించేవరకు చూస్తున్న అతనికి, గోడమీద ప్రాకుతున్న బల్లి కన్పించింది. దీపం కాంతివంతంగా వెలుగుతోంది. కిటికీ తలుపులు గాలికి యింకా కదులుతు నేవున్నాయి. మంచంమీదనుంచిలేచి, కిటికీ తలుపులువేశాడు. ప్రశాంతంగావుంది వాతావరణం, బల్లి గోడమీద కదులుతోంది. పురుగులు గాలిలో అక్కడక్కడ ఎగురుతున్నాయి. చేతులు వెనక్కి పెట్టి, అటూ ఇటూ పచార్లుచేస్తున్నాడు. "ఎందుకు వెళ్ళినట్లు?" తనలో వేసుకున్న ప్రశ్నకు జవాబు లేదు. "ఎందుకు సమాధానం రాదు?" అనుకున్న పర్యవసానం మొదటి ప్రతిఫలమే.

దీపంమీద వాలిన పురుగు కాలిపోయింది. మాడి మసై నేలమీద రాలిపోయింది. దీపం అందంగా వుందని, తనకు ఆహ్వానం అందిస్తుందని, ఆనందించి దానిమీద వ్రాలింది. అందంగావున్న ఆదరణ, తన ప్రాణాన్ని తీసింది; బూడిదిగా చేసింది. గోడమీద బల్లి చూస్తోంది. బల్లి నవ్వుతున్నట్లు అనుకుంటున్నాడు. దీపంతీసి, నేలకేసి కొట్టాలనిపించింది. ఒకరికి వెలుతురు, మరొకరికి చీకటినిచ్చే దీపంమీద జాలివేసింది. గోడమీదపడుతున్న పురుగుల్ని పట్టుకొని; కడుపులో వేసుకుంటున్న బల్లి, అతన్ని చూచి వెక్కిరిస్తోంది.

"అది బల్లి కాదు, కుటుంబరావు." అతడు అరవాలనుకున్నాడు. హృదయంతో బలం సన్న

గిలింది. ఆందోళన అధికమైపోయింది. ఉద్రిక్త పరచిన వాతావరణం, అతన్ని వెర్రెత్తిస్తోంది. రెండు పట్టాలమధ్య రైలు పరుగెడుతోంది, కుటుంబరావు వికృతంగా నవ్వుతున్నాడు. వేగంగా వెళ్లిపోతూన్న రైలు అకస్మాత్తుగా ఆగిపోయింది. ఎవరో రైలు క్రింద పడిపోయారని, ప్రయాణీకులు క్రిందకి దిగుతున్నారు. కుటుంబరావు దిగలేదు. ఇంకా నవ్వుతూనేవున్నాడు. వెంకట్రావు త్రుళ్లిపడి దీపంవైపు చూశాడు. రైలూ లేదు, ఏమీ లేదు. అతని మనస్సులో ఆందోళనతప్ప, కుటుంబరావులాంటి మనుష్యులంటే అతనికి అసహ్యం. భూమిమీద అటువంటి వాళ్లు వుండటమే అతనికి ఏవగింపు. భగవంతుడు అటువంటి మనుష్యులను ఎందుకు సృష్టిస్తాడు? అతనెందుకు వేసుకోవాలిప్రశ్న? కుటుంబరావు అతన్ని ఏంచేశాడు? వెలుతురులో కత్తి తళతళా మెరిసిపోతోంది. నల్లని ముసుగు, కళ్ల క్రిందవరకు కప్పుకున్న వ్యక్తి, తన వేపుకి వస్తున్నాడు. వెంకట్రావు ముఖంనిండా ముచ్చెమటలుపోశాయి. గుండె వేగంగా కొట్టుకుంటూంది. చంపుతాడా కొంపదీసి? ఊహుఁ ... "నరకుతాడు, కత్తితో ఒక్కపోటు...గుండెలో ... నెత్తురు 'జిఁయ్'మని పైకిలేస్తుంది." నల్లనితెర ముందుకు ... చాల దగ్గరగా వచ్చేస్తోంది. కాళ్లు వణికిపోతున్నాయి, వళ్ళంతా తడిసిపోయింది. కత్తి పదునుగావుంది, మంచి అదను, ఎవరూ లేరు, అరిస్తే, రక్షిస్తారేమో? ... నోరు తెరవబోయాడు. కత్తి మొన గుండెకు దగ్గరగా వచ్చేసింది. నాలుక పిడచ కట్టుకుపోయింది.

"నన్ను చంపవద్దు, నా దగ్గర ఏముందని చంపుతావు." అతడు మాత్రం అనలేదు. అని వుంటాడని అనుకున్నాడు.

"నీదగ్గర నాకు కావలసింది చాలావుంది." నల్లని ముసుగులోంచి బెదరింపు.

"డబ్బులేదు, దారిద్ర్యంవుంది." అధైర్యపడుతూ.

"నీ డబ్బు, దారిద్ర్యంవొద్దు, వీటికంటె విలువైన వస్తువు నీ దగ్గరవుంది."

"నా ప్రాణం ... అంతేనా?" బలవంతంగా తెచ్చుకున్ననవ్వు, కత్తివేపు చూచింది. కత్తికి జాలివేయలేదు. ప్రాణంమీద సవారి చేస్తోంది.

"నీ ప్రాణంకాదు, నువ్వుకాదు."

"అయితే నా దగ్గర యింకేమిలేదు."

"అది నీకు తెలియదు. ఈ కత్తి చేతులోవున్నవానికితప్ప, యింకెవరికికూడ తెలియదు."

"నీకు కావలసింది తీసుకో!"

"నీవే యివ్వాలి!"

"చెప్పితే, ఆ విధముగానే యిస్తాను."

"నీ సౌశీల్యం, సహృదయం కావాలి. డబ్బు యిచ్చి కొనుక్కుందామంటే అవి లభ్యంకావని దీన్ని వుపయోగించవలసివచ్చింది." అతనికేమి అర్థం కాలేదు. కత్తిమీద వల్లమాలిన జాలి వేసింది.

"సాధించు." కళ్ళుమూసుకున్నాడు. శరీరం గజగజవణికిపోయింది. చీకటి మాత్రం కన్పిస్తోంది.

అన్నయ్యా, అమ్మా! సుగుణ మాటలు విన్పించేసరికి, ఉలిక్కిపడి, కళ్ళు నలుపుకుంటూ చూశాడు.

నల్లని ముసుగు కన్పించలేదు. గుండెమీద చూచుకున్నాడు. కత్తిలేదు. వెలుగుతున్న దీపం, గోడమీద బల్లి వాటి పనులు అవి నిర్విరామంగా చేసుకుపోతున్నాయి. ముసుగులోవున్న మనిషి ఎవరు? కుటుంబరావుకాని కాదుగదా! ఎందుకు మాయమయ్యేడు. అయితే కలా! కళ్ళు తెరిచివుండి కలయేమిటి? పిచ్చిగాని, ఎవరైనావింటే నవ్విపోతారు. నిజంగా జరిగితే, తను ఇంకా బ్రతికేవున్నాడు. అతడెందుకు "అది" అడిగాడు. వాటివల్ల అతనికి ఉపయోగం? చాల విచిత్రంగా వుంది. రైలు రైలు పట్టాలు, నల్లని ముసుగు, పదును కత్తి, ఇవన్ని అతని ఆలోచనలకు ఆకారాలు, అంతే!

రిక్షావాడికి డబ్బులుయిచ్చి, వీధి గుమ్మంనుంచి వస్తూన్న 'సుభద్రమ్మ' వెంకట్రావునిచూచి, నిలబడింది. అతడు మంచంమీదవచ్చి కూర్చున్నాడు. దీపంవత్తి కాస్త పెద్దదిగాచేసి, సుబద్రమ్మ, మంచంమీద అతనికి కొంచెం దూరంగా కూర్చుంది. సుగుణ గుమ్మానికి ఆనుకొని నిలబడింది. చాల సేపటివరకు, ఎవరు ఏమిమాట్లాడుకోలేదు. తాను వెళ్ళినపని చెప్పడానికి ప్రయత్నంచేసి, చెప్పలేకపోతూంది సుబద్రమ్మ. "ఎందుకు వెళ్ళినట్లు ?" తను వేసుకున్న ప్రశ్నకు సమాధానం ఈ సారి వస్తుందని తెలిసుండికూడ, మాట్లాడకుండా మౌనంగా వూరుకున్నాడు వెంకట్రావు. ఎవరు ఏమిమాట్లాడకుండా కూర్చోవడం రుచించలేదు సుగుణకు.

"అన్నయ్యా! చాల సేపయింది. భోజనానికిలే" అంది. సుబద్రమ్మ కల్గచేసుకొని, "ఇంకా భోజనం చేయలేదా - భోజనానికిలే" కుమారునివైపు చూస్తూ అంది.

"కుటుంబరావు ఏమన్నాడు ?" కొంచెం కటువుగా అడిగాడు, భోజనం విషయం విస్మరిస్తూ.

"నేనూ అదే చెప్పాలని అనుకుంటున్నాను. చెప్పిన తర్వాత నీవు బాధపడతావని, వెనుకాడుతున్నాను." కొంచెం వెనుకాడింది. అతడేమి తిరిగి సమాధానం యివ్వలేదు. చెప్పమన్నట్లు తలవూపాడు.

"కుటుంబరావుగారు చాల మంచివారు ?"

"అవును, చాల మంచివారు ... "

"అతని విషయం నీకుకూడ అర్థమయిందిగా ;"

"బాగా అర్థమయింది. అతని మనస్సు తేనెపూసినకత్తి, హృదయం పయోముఖ విషకుంభం."

సుబద్రమ్మ తెల్లబోయింది. సుగుణ వింతగా వింటోంది.

"అతని సంగతి తెలుసుండికూడ, కుటుంబరావు ఇంటికి ఎందుకు వెళ్ళినట్లు ?"

"నీ గురించి వెళ్ళాను, కావలసినవాళ్ళకు దూరమయిన, మన కష్టసుఖాలను తెలుసుకుంటున్నారు కాబట్టి, వెళ్ళక తప్పిందికాదు."

"అతడు మనకు చేసిన అన్యాయం మఱచిపోయావనుకుంటాను. మన సాధక బాధలను తెలుసుకుంటున్నాడని అనుకుంటున్నావు. అతడు మనకు సహాయం చేస్తాడని ఆశపడుతున్నావు. మన విషయంలో అతడు చేయబోయే ప్రతి ప్రయత్నం మన జీవితాలను పాతమార్చడానికని గ్రహించవలసి ఉంటుంది."

"ఎవరో గిట్టనివాళ్లు చెప్పినమాటవిని ... నాకు నమ్మకంవుంది - అతడు చాల మంచివాడు ... లోకం కూడా అంటుందిగా !"

"సరి, అయితే ఏమన్నాడు ?"

"నీ చదువుకోసం సహాయంచేయమని అడిగాను. వందరూపాయలు అప్పు అడిగాను. ఇస్తానని చెప్పాడు. కాని ఒక్క షరతు పెట్టాడు. వాళ్లమ్మాయిని నీవు చేసుకుంటే, తప్పకుండా చేతనయినంతా సహాయంచేస్తానన్నాడు. చదువు చెప్పిస్తాడు, మంచి ఉద్యోగం ఇప్పిస్తాడు."

వెంకట్రావుకి వళ్లు కంపరమెత్తింది. అనుకున్నంత పనిచేశాడు. మంచి పథకంవేశాడు. పన్నాగం బాగుంది. బంగారు సంకెళ్ళు.

"అందుకు అంగీకరించావా అమ్మా ?" వెంకట్రావు లేచినిలబడ్డాడు.

"నీతో సంప్రదించేవరకు మాట యివ్వనన్నాను."

"అయితే నీవు అడిగిన డబ్బు యిచ్చాడా ?"

ఆమె వట్టిచేతులు చెపుతున్నాయి లేదని, ఆమె సమాధానం చెప్పలేదు.

"ఇప్పుడైనా గ్రహించావా - అతని మనస్సు ఎటువంటిదో ?" కోర్టులో లాయరు చెప్పినట్లు చెప్పాడు.

“స్వలాభంలేనిది సహాయంచేయడానికి ఎవరు సాహసించరు. అది సహజం,” సుభద్రమ్మ కుటుంబ రావు తరఫున వాదిస్తోంది.

“అతడు స్వలాభంకోసం ప్రాకులాడుట లేదు. స్వార్థంకోసం ఈ ప్రయత్నమంతా చేస్తున్నాడు. సహాయం చేస్తున్నానని పేరుచెప్పి, స్వార్థానికి బదులు త్యాగం అనే పదం వుపయోగించి, త్యాగ పురుషుడనిపించుకోవాలని చూస్తున్నాడు. అతని సహాయంవొద్దు, అతని ఆదరణవొద్దు.”

“పరిస్థితులు ప్రతికూలంగావున్నప్పుడు, యితరుల మీద ఆధారపడాలి. లేకపోయినట్లయితే, మన జీవితాలింతే!”

“అమ్మా! నీవన్నది కాదనడంలేదు. కాని, కుటుంబరావు విషయంలో నా మనస్సు అంగీకరించదు.”

“పోనీ, మీ మామయ్యను వెళ్లి అడుగు. గతించిన విషయాలన్ని మఱచిపోగల్గితే-సహాయంచేగయలడు.”

“మామయ్యను యాచించి బ్రతకడంకంటె, అడుక్కొని తినడంలో ఆనందంవుంది. తమ్ముడనే అభిమానంకొద్దీ, అచ్చటకు వెళ్లమంటున్నావుగాని, అతనికి నీపైవున్న అనురాగం ఎటువంటిదో తెలుసుకోగల్గావా?”

“అన్ని రోజులు ఒకలాగవుండవు. పాతరోజులను వాడెప్పుడో మరచిపోయివుంటాడు. మనమీద వారికి అభిమానంవుంటుంది?”

“మామయ్యను మంచిగా అర్థంచేసుకున్న నాన్న జీవితాన్ని నిలువునా నాశనంచేశాడు. మనం ఈ విషయాన్నికప్పినా ప్రపంచం నోరును కప్పలేము.”

“దుర్మార్గులుగా ఎప్పుడూ ఎవరూ ఉండిపోరు. వారిలో హృదయ దౌర్బల్యం స్థిరంగా నిలిచిపోదు. మానవుడు ఎప్పటికైనా మంచి వాడవకుండా మానడు.”

“అది ఎవరి విషయంలోనైనా జరుగుతుందిగ్గాని, మామయ్య విషయంలో జరగదు.”

“ఇంకా నీది చిన్నవయస్సు. ప్రపంచంలో విషయాలు అర్థంచేసుకోలేకుండా ఉన్నావు. ఒకరి మీద ఆధారపడటమంటే మీ నాన్నకు మహారాము ఇష్టముండేదికాదు. చనిపోయేవరకు స్వతంత్రంగా బ్రతికారు. వారు స్వతంత్రంగా బ్రతికి మనకు ఒలక పోసింది, నిరాధారులుగా వదిలిపెట్టడమే. ఇప్పుడు మనం స్వతంత్రులంకాదు. పరిస్థితులకు బానిసలం. కాలంచేతిలో కీలు బొమ్మలం మరి యొకరి అభిమానం మీద ఆధారపడవలసిన వాళ్లం.”

“నాన్నలాగ మనం ఎందుకు బ్రతకలేం!”

“మీ తాతగారు వదిలిపెట్టివెళ్లినఆస్థి, మీ నాన్నగారు వదలిపెట్టివెళ్లితే, నీవనుకున్నది జరుగుతుంది.”

“వట్టిది. జీవితాధారం ఆస్థులమీద సరిహద్దులను కట్టుకున్నా, ఆస్తిపాస్తులులేనపుడు, భగవంతుడిచ్చిన మంచితో స్వతంత్రంగా బ్రతకవచ్చును.”

వెంకట్రావు మాటలు అతిశ్రద్ధగా వింటున్న సుగుణ హృదయం జలదరించింది. ప్రతి పలుకు మదిలో మెదులుతూ ప్రతిధ్వనిస్తునేఉంది.

“నీ ఇష్టం” అని సుబద్రమ్మలేచి నిలబడి, సుగుణ దగ్గరకు వచ్చింది.

“చూశావా తల్లీ! మీ అన్నయ్యవాదం!”

“అమ్మా! అన్నయ్యవాదం వేదం, అన్నయ్య భగవంతుడిచ్చిన మంచికోసమే బ్రతకాలి, అప్పుడే ధన్యజీవి అయ్యేది.”

“సరి, వాడిపిచ్చి నీకూసోకింది. అయితే ఈ ఇంట్లో వేగటం కష్టమే! వాడ్ని భోజనానికిపిలు.”

సుబద్రమ్మ వంటింట్లోకివెళ్లి, వడ్డించడంలో నిమగ్నురాలైంది. వెంకట్రావు ఆదరాబాదరా నాల్గు మెతుకులు నోట్లోవేసుకొని బయటకు వెళ్ళిపోయాడు.

బయట చీకటి గుయ్యారం ... కృష్ణలంక గట్టు మీద నడుస్తున్న వెంకట్రావుకి, ఎదురుగుండా కన్పించే ప్రతి వస్తువు నల్లగా కన్పిస్తుంది. రాళ్ళు తగులుతున్నాయి. ఎదురుదెబ్బలు మిగులుతున్నాయి. గట్టుదిగాడు. ఇళ్ళు కన్పించాయి. జనసంచారం లేదు. మానవులు రేరాణికౌగిలిలో ఘాఢసుషుప్తిలో మునిగివున్నారు. కొంచెందూరం వచ్చేసరికి, కృష్ణవేణి తరగలు కన్పించాయి. వడిలేదు. తడినేల మీద వడివడిగా నడుస్తున్నాడు. నదిని సమీపించాడు. అలలు కదులుతున్నాయి. జీవిత వలయాలు తగులుకున్నాయి.

"ఈ విశాల ప్రపంచంలో అందరూ ఇంతేగా !" ఇసకదిబ్బమీద కూర్చున్నాడు.

మామయ్య:-బలసిన వళ్ళు...ఎర్రని కళ్ళు.. రాతి గుండె ... మండే బండ ... అమాయక జీవితాల పచ్చి నెత్తురు పీల్చి, మండే గుండెలనుపిండి నెత్తుటి బొట్టుల రాల్పించి, ఖననాలు చేస్తున్నాడు. ధర్మం న్యాయం, నీతి, నిజాయితీ, జాలి, దయ, అభిమానం ఆదరణ ... వీటిస్వరూపాలు ఏ కోణంనుంచి వెదికిన కన్పించవు. రక్తసంబంధమైన అనుబంధాన్ని కూడ త్రుంచివేస్తాడు.

కుటుంబరావు మామయ్య అవతారంలో రెండవ అవతారం. పైకి మంచివాడుగా కన్పిస్తాడు ... స్వతసిద్ధంగా మంచివాడుకాదు. నటిస్తాడు. మంచివాడుగా నటించి, జీవితాలను హతమారుస్తాడు. కళ్ళల్లో గంగానదులు కదులుతున్నా, హృదయంలో అగ్ని పర్వతాలు పగిలిపోతూ ఉంటాయి.

వెంకట్రావు వాళ్ల చిత్రాలు స్పష్టంగా చూస్తున్నాడు. నిశబ్ధంగా ఉంది. భ యం క రం గా కన్పించింది. అటువంటి మనస్తత్వాలు భూమిమీద ఉంచకూడదు. భగవంతుడు వాళ్ళకు చావు అంత త్వరగా ఎందుకు ఇవ్వడు?

కాలేజి జ్ఞాపకానికి వచ్చింది. పేరు కొట్టేశారు. జీతం కట్టలేదు. శ్రద్ధగా చదువుకుంటున్నా, మంచి మార్కులు సంపాదిస్తున్నా ప్రయోజనంలేదు. జీతం కట్టాలి. డబ్బిచ్చి చదువు కొనుక్కోవాలి. ప్రతి వస్తువును, చివరకు విద్య మొదలుకొని మానవుడ్ని వరకు డబ్బిచ్చి కొనుక్కోవలసిందే! డబ్బులేదు_ బ్రతకాలి ... చదువుకోవాలి, ఎట్లా! తనతోటి విద్యార్థులంతా పెద్ద పెద్ద చదువులు చదువుతున్నారు. డాక్టర్లు, ఇంజినీర్లు, కవులు, ఫిలాసఫర్స్, ప్రొఫసర్స్, పెద్ద పెద్ద ఉద్యోగాలు, ఘనమైన మర్యాదలు, తనో! ఆశలు పెంచుకుంటున్న నిరాశాజీవి. జీవిత పురోగమనానికి పువ్విళ్లూరుతాడు. ఉత్సాహంతో జీవితంలో మంచి ఆశలను సృష్టించుకుంటాడు. తన ఆశలన్నీ అడియాశలవుతాయి. జీవిత సరిహద్దులచుట్టూ నల్లని నిరాశ తెరలు జారుతాయి.

తీరని కోర్కెలు, ఆరని ఆశలు, మారని ఆశయాలు ... అతని చుట్టూ తిరుగుతున్నాయి.

భూమి తనచుట్టూ తాను తిరుగుతోంది. తన చుట్టూ తాను తిరగటమే కాకుండా, సూర్యుడి చుట్టూకూడా తిరుగుతుంది. వెంకట్రావుచుట్టూ, అవికూడా అంతే! జీవిత ఎడారి మధ్యంలో ఇంకిపోతున్న ఆశావాహినికి ఆనకట్టకట్టాలి. ఆ ప్రవాహాన్ని నవవసంతాన్ని అలంకరించుకుంటున్న ఉద్యానవనంపైపు మళ్లించాలి. తియ్యనికలలు, కమ్మనిపాటలు, కటిక-చీకటిలో కలిసిపోతున్నాయి.

"ఏం చేయాలి?" ఎవర్ని అడుగుతున్నాడు? కదలని ఆకాశం ... నడుస్తున్న మబ్బులు...కదులుతున్న అలలు, మెదలుతున్న చెట్లు ... మూల్గుతున్న పుట్టలు. ఇవన్నీ అతన్ని చూచి నవ్వుకున్నాయి. అతని నివేదన విన్పించుకుంటున్నాయి.

నవ్వు ... నల్లని ఆకృతి ...

పువ్వు ... తెల్లని ప్రకృతి ... ఘర్షణ ... ఆశకు నిరాశకు మధ్య సంఘర్షణ.

వెంకట్రావుకి వెర్రెత్తుతోంది. తిడుతున్నాడు... ఎవర్ని : జాలిపడని వస్తువులన్నిటిని దుయ్యపెడుతున్నాడు. అసహ్యించుకుంటున్నాడు — ఎవర్ని?

దరిద్రంతో చీకటి ముసుగులో కన్నీరు కారుస్తున్న అతన్ని తానే అసహ్యించుకుంటున్నాడు.

నడుస్తున్న చరిత్ర ... నటిస్తున్న మనుష్యులు ... వెక్కిరిస్తున్న లోకం ... విలపిస్తున్న యీలోకం... డబ్బుండి తినలేక ఏడుస్తున్న జంతువులు ... తిన డానికీ తిండిలేక కుమిలిపోతున్న అనాథలు ... ...

ప్రపంచమంతా పెద్దనాటకం ... నమ్మకూడదు, వేషాలు వేసే వాళ్ళను అసలేనమ్మకూడదు ... కుటుంబరావు విలన్ ... మామయ్య మరో పెద్ద విలన్ ...

భూమి వీళ్ళందర్ని భరిస్తుంది.
ఎంత కన్నీరు కారుస్తుందో పాపం
కాలం వీళ్ళందర్ని లాక్కొని వెళ్తుంది.
ఎంత బరువును వహిస్తుందో పాపం !

చేటలో పడిన పాప కళ్ళు మెల్లమెల్లగా విప్పు తోంది. కాటిలో పడబోతున్న తాతకళ్లు మెల్ల మెల్లగా మూసుకుపోతున్నాయి...

"దేనికోసం వీళ్ళందరు పుడుతున్నారు?",

"దేనికోసం పుట్టిన వాళ్ళు మరికొంత మందిని పుట్టిస్తున్నారు? "

కాలాన్నడిగితే ! ! !

లోకం నవ్వుతుంది.

పిచ్చిలోకం ... వెర్రి మనుష్యులు ... మనస్తాపాలు మనస్థైర్యాలు ... మమకారాలు ... మోసాలు... రోషాలు ... వెక్కిరింపులు ... వెకిలితనాలు ...

వేదాంతంలో మునిగిపోయిన వెంకట్రావు మబ్బు కన్నీటి బురదలో మలినమైపోయిన చంద్రవంకలాగ చావు బ్రతుకుల మధ్య చరలాడే ప్రాణిలాగ, నిశలో నిర్వేదిస్తున్నాడు.

తెల్లగా తెల్లవారి పోయింది. కృష్ణలో దిగి మొహం కడుక్కొని, ఇంటికి బయలుదేరాడు.

"సుగుణ ! మీ అన్నయ్య ఎక్కడ ? " గుమ్మంలో కాలు పెట్టిన ఉత్తరక్షణంలో, జానకి మాటలు విన్పించాయి. సుగుణ వెంకట్రావుని చూచి క్షణం కాలంలో తల్లి దగ్గరకు వెళ్ళింది. సుబ్రహ్మణ్యమ్మ సుగుణను వెంట బెట్టుకొని వెంకట్రావు కూర్చున్న గదిలోనికి వచ్చింది.

కళ్ళు లోతుకు పోయాయి కళ్ళల్లో ఎర్రచారలు పడ్డాయి. నుదుటిమీద ముంగురులు చిందర వందరగా పడిఉన్నాయి. సుబ్రహ్మణ్యమ్మ త్రుళ్ళి పడింది. మనస్సులో బాధపడింది. తల్లికళ్ళల్లోనికి చూశాడు. విరుగు, కరుగు, మరుగులేని అవ్యక్త మైన ప్రేమ తొణికిసలాడింది. ఆర్తి, బాధ, దుఃఖం లేని ఆ మాతృహృదయంతో అనూహ్యమైన ప్రేమ కళ్ళ వెనుక కట్టలు త్రెంచుకొని, కళ్ళముందు కదిలి పోతూ ఉంది. నిశ్శబ్ధంగా నిలబడిఉంది.

"అన్నయ్య ! అమ్మనీ కోసం ! " సుగుణ మాటలు ప్రతినరంలోనికి చొచ్చుకొని పోయి, ప్రతిధ్వనిస్తున్నాయి. ఏడ్వాలనిపించింది. తలకాయి నేలకేసి కొట్టుకోవాలనిపించింది.

"ఎంత కఠినాత్ముణ్ని ! అమ్మ నా కోసం లోలోన ఎంత కుమిలిపోతోందో ! అమ్మను ఎంత బాధ పెడు తున్నాను. నా పాపాలకు ప్రాయిశ్చిత్తంలేదు. నన్ను చంపండి ! " తనలోతాను ఏడుస్తున్నాడు. హృదయ గోడల చుట్టూ కన్నీరు జారుతోంది.

"అబ్బ ! ఎంత బాధ ! జబ్బుతో బాధపడుతున్న వాడి కంటె ఎక్కువ బాధ ... అనుభవించాలి. " విలపిస్తున్నాడు. ఎవరూ మాట్లాడంలేదు. విరా మాన్ని భరించడం కష్టంగా ఉంది.

"రాత్రంతా నీ జీవితం గురించి ఆలోచించి ఉంటావు. భగవంతుడు నీకు మంచిని చూపించి ఉంటాడు." సుబ్రహ్మణ్యమ్మ అంటోంది.

"భగవంతుడు ! అంతా వట్టిది. భగవంతుణ్ని నమ్మ గూడదు. మానవుణ్ని అసలే నమ్మగూడదు. అంతా మోసం ? " మొహంమీద పడుతున్న వెంట్రుకలను

చెవుల్లోకి తోస్తూ, తల్లి వేపుకి చూచాడు.

"ఎవర్నీ నమ్మవా ? పోనీ మీ అమ్మనైనా నమ్మలేవా ?" వెంకట్రావు త్రుళ్ళిపడ్డాడు.

"అమ్మ !" మెల్లగా మూల్గాడు.

"ఎవరికి మన మీద నమ్మకం లేకపోయిన వాళ్ళ మీద నైనా మనకూ నమ్మకం ఉండాలి. జానికి వచ్చింది."

"ఇంకా బ్రతికి ఉన్న వెంకట్రావుని చూడ్డానికి చూచిందా ?"

"తెల్లవారకుండానే వచ్చింది"

'నల్లని నాజీవితంచుట్టూ ప్రదక్షిణంచేయడానికా?'

"అవును..." ప్రక్కగదిలో నిలబడి ఉన్న జానకి గుమ్మందాటి, సుబద్రమ్మ ప్రక్కగా వచ్చి నుంచుంది.

"మీరంతా కలసి నా మీద దండయాత్ర చేస్తారా! రాజ్యాలు కోల్పోయిన రాజును ముట్టడిస్తే, ఫలితం సున్నె ... అయితే ఎందుకీ ప్రయాస"

సుబద్రమ్మ, సుగుణ లోపలికి వెళ్ళిపోయారు.

"ఇంత చిన్న వయస్సులో ఎంత వైరాగ్యం" నవ్వుతో, అతని చిన్ని నయనాలలోనికి తొంగి చూచింది.

"కుటుంబరావు కూతురువేనా ?" వెగటుగా అన్నాడు. వికృతంగా నవ్వుకున్నాడు.

"నిజాన్ని నమ్మతావు. మంచి ప్రశ్న వేశావు తెలుసుకోవాలని ఉందా !" నెమ్మదిగా అంది. నవ్వు అధరాలమీద నాట్యంచేసింది.

"చచ్చిపోయిననన్ను ఇంకా ఎందుకు చంపుతావు–వెళ్ళు" బాధపడుతున్నాడు.

"కుటుంబరావు కూతురు నిన్ను చంపడానికి రాలేదు. చనిపోయిన వెంకట్రావును బ్రతికించడానికి"

"బ్రతకాలనిలేదు. చావాలని లేదు."

"అదే మంచి పని..."

"నీ పోర్షన్ పూర్తి అయింది. తర్వాత మరోపాత్ర వస్తుంది. త్వరగా తెరవాలాలి."

"మొదటి రంగంలో కథానాయకుడికి పిచ్చి ఎక్కుతుంది. పాపం ! మంచివాడే ! కాని మాయలో ఆమంచిని మరచిపోతున్నాడు. తననినమ్ముకొని వచ్చిన నీతిని నిర్మూలం చేస్తున్నాడు. తనకోసం వెతుక్కుంటూ వచ్చిన ధర్మాన్ని దూరంగా నెట్టుతున్నాడు."

"బ్రహ్మాండంగా ఉంది నీ కల్పన. హర్షధ్వానులు కోరుకుంటావా !"

"నిన్ను బాధ పెట్టడానికి రాలేదు. నేను బాధ పడటానికి. – బాధపడేనాకెందుకు నీ హర్షధ్వానులు"

"మీరెవరు నాగురించి బాధపడనవసరంలేదు. నన్నే బాధ పడనీయండి. మీరంతానన్ను మోసం చేస్తున్నారు. నన్ను బాధ పడనీయకుండా చేస్తున్నారు."

"బాధంటే అర్థంకానపుడు బాధపడటం ఎట్లాగ నేర్చుకుంటావు. బాధ విషయం మరచిపో ... నీ ఎదురుగుండా మంచి బాట కన్పిస్తుంది. చూస్తే బాగుంటుంది."

"కన్పించేది వెలుగుకాదు ... చీకటి. భయంకరమైన చీకటి ... నల్లనిమసి ... ప్రాణాలుతీసే మసి"

"వెలుగు ఎదురవుతున్నా, చీకటిని సృష్టించుకొనే వాళ్ళకు కన్పించేది చీకటేగాని, తెల్లని లోకాన్ని చూస్తున్నప్పుడు నల్లకళ్ళద్దాలను పెట్టుకొని చూస్తే ఏమవుతుంది? లోకం నల్లగాకన్పిస్తుంది."

"నా కళ్ళే నల్లద్దాలు. తెల్లని వస్తువులు నల్లగానే కన్పిస్తాయి. బాగా వర్ణించావు."

"పోనీ ... పాలు ... నీళ్ళు ... ఇవి రెండూ ఒకలాగే కన్పిస్తాయా ?"

"అయితే చీకటి వెలుగు ... రెండూ ఒకలాగే ఉంటాయిగా !"

"మహాత్ముల విషయంలో అన్నీ ఒకటే !"

"నీవు మహాత్ముడవు కావుగా ! నీ విషయంలో వేరుగా ఉండాలి. ఒప్పుకుంటావా ?"

వెంకట్రావు మౌనం వహించాడు. ఆలోచనలో నిమగ్నుడయ్యాడు.

"స్వలాభం కోసం మా నాన్న కోరుకుంటున్న విషయాన్ని బలవత్తరం చేయడానికి రాలేదు. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు, ఒకరినొకరు జయించాలని చూస్తుంటారు. మా నాన్న నీకు సహాయం చేసి, ఆ సహాయంద్వారా సమానమైన ప్రతిఫలాన్ని సంపాదించాలని ప్రయత్నంచేయడం నిజం. అది సహజంకూడాను. దానికి నీవు అంగీకరించడంలేదు. అటువంటి విషయాలను అసహ్యించుకుంటావు."

"ప్రతి సంగతి అసహ్యంగానే కన్పిస్తుంది. బహుశా నీవన్నదిగూడా అంతేనేమో !"

"ఎదుటివారు బాధ పడతారని అనుకుంటే, హృదయంలో జాలి అనే వెలుగు, ఇంకా ప్రకాశవంతంగా వెలుగుతుంది."

"మీ నాన్నకు జాలి ఉందని నీ ఉద్దేశ్యం. అంతేనా !"

"మా నాన్న విషయం నీ వెప్పుడో చిత్రించుకున్నావు. నీ విషయంలో అటువంటిదే జరిగితే ఏమనుకుంటావు."

"ఇంతకాలం బ్రతికేవాడ్ని కాదు."

"చనిపోయిన తర్వాత ప్రాణంలేని గుండెలో జాలి పుడుతుందని ఆశపడుతున్నావా ?"

"ఆ ఆశలేదు. అది ఉంటే నెరవేరదు. నెరవేరకుండా ఉంటే. మరో జన్మ ఎత్తవలసి ఉంటుంది. తన భక్తుడిని శాపఫలితంగా, ఒకసారి చంపిన తర్వాత మరీ మరీ చంపాలని పునర్జన్మలను కోరుకున్నాడు మహావిష్ణువు. మానవుడు తిరిగి తిరిగి బ్రతకడం ఇష్టంలేదు."

"వాదించడం వల్ల ప్రయోజనంలేదు. ఇదిగో ఈ డబ్బు తీసుకొని, రేపు జీతం కట్టు. ఇది మా నాన్నది కాదు. వారి స్వలాభం కోసం గూడా కాదు. కష్టపడి లేసు కుట్టి, దారం వడికి సంపాదించింది. కష్టపడి సంపాదించిన ఫలాన్ని సద్వినియోగం చేయడానికి, సదవకాశం లభించాలి. అదిప్పుడు లభించింది."

"నన్ను ఓడించడానికి ప్రయత్నంచేస్తున్నావు. నేను ఓడిపోను. అందులో ఆడదానివల్ల ఓడిపోవడం ఆత్మహత్య చేసుకోవడం లాంటిది"

"అని ఆత్మ వంచన చేసుకుంటున్నావు. మరొక్కసారి చెబుతున్నాను. నా ప్రయత్నం వెనుక మరొక ఆశలేదు. కష్టాన్ని సద్వినియోగం చేసి, ధర్మాన్ని కాపాడటమే నా ప్రయత్నం."

ఆమె వెనక్కి తిరిగి వెళ్లిపోతూ, గుమ్మందగ్గరకు వచ్చేసరికి, అకస్మాత్తుగా ఆగిపోయింది. మళ్ళీ వెంకట్రావు వేపుకి చూచి, అక్కడే నిలబడింది.

"నీ ఏకాంతాన్ని అంతరాయం కల్గించటం నా కిష్టంలేదు. కాని ఒక్కమాట మిగిలి పోయింది."

"వినలేను."

"అయితే సరి ... వెళ్తాను." ఆమె వెళ్ళిపోయింది. చీకటి మలుపులో "ఆ ఒక్కమాట కోసం" వెతుక్కుంటున్నాడు వెంకట్రావు. అది రాత్రికాదు. పగలే! వాస్తవిక వెలుతురులో వెతుక్కుంటున్న వస్తువు దొరకలేదు.